ప్రతి శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రమదానం

పాడేరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి శుక్రవారం శ్రమదానం నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అధికారులు, ఉద్యోగులు తమ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అందుకు ప్రతి శుక్రవారం శ్రమదానం చేయాలని ఆయన పేర్కొన్నారు.



మహాత్మాగాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రిల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, తదితరులు

గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రిలకు ఘన నివాళి

కలెక్టరేట్‌లో జాతిపిత మహాత్మాగాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రిల జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రిల చిత్రపటాలకు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

-పాడేరు/ఆంధ్రజ్యోతి

ఎట్టకేలకు సీలేరుకు బస్సులు పునరుద్ధరణ

24 రోజుల తరువాత రాకపోకలు



24 రోజుల తరువాత సీలేరుకు వచ్చిన ఆర్టీసీ బస్సు

సీలేరు, అక్టోబరు 2: ఎట్టకేలకు బుధవారం సీలేరుకు బస్సులను పునరుద్ధరించారు. 24 రోజుల తరువాత బస్సులు రావడంతో సీలేరు వాసులు ఆనందం వ్యక్తం చేశారు. గత నెల 8న బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో సీలేరు-జీకేవీధి ప్రధాన రహదారిలో కొండచరియలు విరిగిపడడంతో సీలేరుకు నర్సీపట్నం, విశాఖపట్నం, పాడేరు డిపోల నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అయితే వారం రోజుల క్రితం ఆర్ అండ్ బీ అధికారులు జీకే వీధి- సీలేరు రోడ్డును పునరుద్ధరించారు. మళ్లీ వర్షాలు కురవడంతో లంకపాకల, సంపంగిగొంది వద్ద దిగబడిపోతుండడంతో బస్సులను సీలేరుకు ఆర్టీసీ అధికారులు పంపించలేదు. కాగా ఆర్ అండ్ బీ అధికారులు బురదగా ఉన్న ప్రాంతంలో వెట్‌మిక్స్ వేసి బస్సులు దిగబడకుండా చర్యలు చేపట్టారు. దీంతో ఆర్టీసీ అధికారులు బుధవారం నర్సీపట్నం- సీలేరు బస్సును పునరుద్ధరించారు. గురువారం నుంచి విశాఖపట్నం- భద్రాచలం బస్సులను కూడా పునరుద్ధరిస్తామని విశాఖపట్నం ఆర్టీసీ డిపో అధికారులు తెలిపారు.

రక్షణ గోడలతోనే రైల్వే లైన్ భద్రం


కొత్తవలస-కోరాపుట్ రెండో లైన్‌లో బొడ్డవర-కరకవలస మధ్య పరిస్థితులపై ఏయూ జియాలజీ విభాగం అధ్యయనం

- మొత్తం 19 ప్రాంతాల్లో 60 వరకూ రాళ్లు, మట్టి నమూనాలు సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పరిశీలన
- సుమారు పది నెలల పరిశోధన అనంతరం రైల్వేకు నివేదిక
- ప్రమాదాల నివారణకు పలు సూచనలు
- కొన్నిచోట్ల గాబియన్ వాల్స్ నిర్మించాలి
- మరికొన్నిచోట్ల వైర్ మెస్ ఏర్పాటుచేయాలి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రైల్వే శాఖ అనేక మార్గాల్లో రెండో లైన్, మూడో లైన్ నిర్మిస్తోంది. ఈ క్రమంలోనే కొత్తవలస-కోరాపుట్ మధ్య డబుల్ లైన్ పనులు జోరుగా జరుగుతున్నాయి. అయితే ఏజెన్సీ ప్రాంతంలో రైల్వే శాఖకు కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో కొండవాలు ప్రాంతాల్లోని లైన్లపై రాళ్లు పడుతుండడంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేకే లైన్‌లో కొండచరియలు విరిగిపడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటిని నియంత్రించేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించవలసిందిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం జియాలజీ విభాగాన్ని వాల్తేరు డివిజన్ అధికారులు కోరారు.

కొత్తవలస-కోరాపుట్ మధ్య కొండవాలు ప్రాంతం ఎక్కువగా ఉన్న బొడ్డవర- కరకవలస సెక్షన్ మధ్య అధ్యయనం చేయాలని రైల్వే అధికారులు కోరారు. ఆయా ప్రాంతాల్లో రైల్వే లైన్ ఏర్పాటుకు 19 చోట్ల కొండవాలు ప్రాంతాలను రైల్వే అధికారులు కట్ చేశారు. ఆ ప్రాంతాల్లో భవిష్యత్తులో రాళ్లు పడే ప్రమాదం ఉందా?, అక్కడ రాళ్ల, మట్టి సామర్థ్యం ఎంత అనే అంశాలపై ఏయూ బృందం పరిశోధించింది. గత ఏడాది నవంబరులో జియాలజీ ప్రొఫెసర్ల బృందానికి ఈ ప్రాజెక్టును అప్పగించగా, తొమ్మిది నెలలపాటు అనేక అంశాలను పరిశీలించి కీలక సూచనలతో కూడిన నివేదికను రైల్వే శాఖకు అందించింది.



ఏయూ జియాలజీ విభాగం



రైల్వే లైన్‌లోని రాళ్ల శాంపిల్స్‌ను పరిశీలిస్తున్న ఏయూ జియాలజీ పరిశోధన బృందం

19 చోట్ల రాయి, మట్టిపై పరిశోధన

రైల్వే అధికారులు లైన్ వేసే క్రమంలో ఎక్కడెక్కడ కొండను కట్ చేశారో ఆయా ప్రాంతాల్లో అధికారులు రాయి, మట్టిని తీసి పరీక్షించారు. ఈ రెండు సెక్షన్లలో 19 చోట్ల నమూనాలను సేకరించారు. వీటిని ఏయూలోని ల్యాబ్‌లో పరిశీలించారు. పైన కనిపిస్తున్న మట్టి, రాయితోపాటు భూమి లోపల ఉన్న రాయి, మట్టిని సేకరించి మైక్రో స్కోపీ స్టడీ నిర్వహించారు. భూమి లోపల ఉన్న మట్టి, రాయి సామర్థ్యంపై అంచనాకు వచ్చేందుకు బొర్రాగుహలు, బొడ్డవర సెక్షన్‌లో 12 మీటర్ల లోతున రెండు బోర్లు వేసి నమూనాలను సేకరించారు. కొండవాలుకు బలమైన సపోర్ట్ ఉందా?, లేదా..?, కొండపై ఉన్న రాళ్ల సామర్థ్యం ఎంత..?, రాయి, మట్టి లూజ్‌గా ఉందా?, టైట్‌గా ఉందా..?, మట్టి, రాయికి తేమను తట్టుకునే సామర్థ్యం ఎంత శాతం ఉందన్న విషయాలను అధ్యయన బృందం పరిశోధించింది. బొర్రాగుహలు నుంచి కరకవలస వరకు మట్టితో కూడిన కొండవాలు అధికంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వర్షం వల్ల మట్టి కిందకు కొట్టుకుని వెళ్లిపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. తొమ్మిదో నంబర్ కొండవాలు వద్ద పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయి. మట్టితో కూడిన బండరాళ్లు బయటకు వేలాడుతున్నాయి. వర్షాకాలంలో అక్కడ ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని గుర్తించారు. మిగిలినచోట్ల రాళ్లు ఉన్నట్టు గుర్తించారు. ఈ రాయి నాణ్యత, లోపల పగుళ్లు ఉన్నాయా..?, రాళ్లలోకి నీరు వెళితే ఎంత వరకు పగలకుండా ఉంటాయన్న విషయాలను సైంటిఫిక్ మెథడ్‌లో అధికారులు పరిశోధించారు. 19 ప్రాంతాల నుంచి 60 నమూనాలను పరీక్షించారు. ఈ పరిశోధనకు కెనడియన్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించారు.

రిస్క్ ఫ్యాక్టర్స్‌ను దాటి..

కొండవాలు ప్రాంతాల్లో రైల్వే లైన్ గానీ, ఇతర ప్రాజెక్టులను గానీ రైల్వే అధికారులు చేపట్టినప్పుడు కొన్ని పారా మీటర్స్‌ను అనుసరిస్తారు. కొండవాలు ప్రాంతాల్లో పనులు చేస్తే తప్పనిసరిగా ఫ్యాక్టర్ ఆఫ్ సేఫ్టీ 1.3గా ఉండాలని రైల్వే అధికారులు నిర్దేశించుకున్నారు. ఫ్యాక్టర్ ఆఫ్ సేఫ్టీ అనేది కొండవాలు ప్రాంతంలోని రాయి సామర్థ్యాన్ని తెలియజేస్తుంది. అంటే, కొండవాలులో ఉన్న రాయి ఎంత బలంగా ఉంది?, కొలాప్స్ అవుతుందా?, స్థిరత్వంగా నిలబడుతుందా..? అన్న విషయాలను కొన్ని పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఏయూ అధికారులు రాక్ సైన్స్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి ఈ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో పరీక్షించగా 1.4 నుంచి 1.7 వరకు వచ్చింది. అంటే చాలావరకు ప్రమాదాలకు అవకాశం ఉండదన్న విషయాన్ని తేల్చింది.

ఇవీ సూచనలు..

పరిశోధనకు సంబంధించిన కీలకమైన అంశాలతో కూడిన నివేదికను రైల్వే అధికారులకు అందజేశారు. వీటిలో కొన్నిచోట్ల రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు చేయాలని, కొన్నిచోట్ల గాబియన్ వాల్స్ నిర్మించాలని, రాక్ బోల్టింగ్ చేయాలని ఏయూ పరిశోధన బృందం సూచించింది. అలాగే, కొన్నిచోట్ల చెక్ డ్యామ్స్, మరికొన్నిచోట్ల వైర్ మెస్, ఇంకొన్నిచోట్ల విప్ హోల్స్ ఏర్పాటుచేయాలని సూచించింది. వీటి ద్వారా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చునని పరిశోధన బృందం తేల్చింది. తొమ్మిదో నంబర్ కొండవాలు వద్ద మట్టితో కూడి ఉన్న బండరాళ్లను తొలగించాలని, అవసరమైతే బ్లాస్టింగ్ చేయాల్సి ఉంటుందని సూచించింది. అనంతరం రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని నివేదికలో అధికారులు పేర్కొన్నారు. వీటిద్వారా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చునని పరిశోధన బృందం తేల్చింది. ఈ ప్రాజెక్టుకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎ.శాంతారామ్ వ్యవహరించగా, విభాగాధిపతి ప్రొఫెసర్ కె.సత్యనారాయణరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కరుణ కరుడుతోపాటు మరో ఆరుగురు విద్యార్థులు భాగస్వాములయ్యారు.



రైలు పట్టాలపై పడిన కొండచరియలు (ఫైల్)

ఏకలవ్య స్కూళ్లతో మెరుగైన విద్య

కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్

- పెదబయలు, అరకులోయ స్కూళ్లను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

పెదబయలు, అక్టోబరు 2: కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఏకలవ్య మోడల్ స్కూళ్లతో గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందుతున్నదని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. పెదబయలు, అరకులోయ ఏకలవ్య మోడల్ పాఠశాలల భవనాలను బుధవారం ప్రధాని మోదీ జార్ఖండ్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. పెదబయలులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గిరిజన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలతో మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతోనే ఏకలవ్య మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.



పెదబయలులో ఏకలవ్య స్కూల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ దినేశ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



అరకులోయలో శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న సుభాషిణి, దొన్నుదొర తదితరులు

పాడేరు డివిజన్ పరిధిలో ప్రతి మండలానికి ఒక ఏకలవ్య స్కూల్ అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎంపీపీ జర్సింగ్ బాలంనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, ట్రైకార్ ... మిగతా 8వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ముగ్గురికి గాయాలు



మృతురాలు రోజా (ఫైల్)

అరకులోయ, అక్టోబరు 2: రోడ్డు ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందగా, ఆమె భర్త, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అరకులోయ జ్యోతిమహల్- పద్మాపురం జంక్షన్ మధ్యలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. డుంబ్రిగుడకు చెందిన సాగర చిన్ని తన భార్య రోజా, ఇద్దరు పిల్లలతో అరకులోయ నుంచి డుంబ్రిగుడకు బైక్‌పై బుధవారం మధ్యాహ్నం బయలుదేరాడు. అరకులోయ జ్యోతి మహల్- పద్మాపురం జంక్షన్ మధ్య వెనుక నుంచి వ్యాన్ వచ్చి వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో బైక్ వెనుక కూర్చున్న రోజా రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడింది. ఆమెను వెంటనే ఆటోలో ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతి చెందిందని తెలిసి బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆమె భర్త చిన్నికి, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో 40 మద్యం దుకాణాలు

జనాభా ప్రాతిపదికన రూ.65 లక్షలు, రూ.55 లక్షల శ్లాబ్‌లో షాపుల కేటాయింపు

9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు

- 11న పాడేరులోని వీఆర్ ఫంక్షన్ హాల్‌లో డ్రా

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లాలో 40 మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన గెజిట్(493/2024)ను మంగళవారం విడుదల చేసింది. జనాభా ప్రాతిపదికన రూ.65 లక్షలు, రూ.55 లక్షల శ్లాబ్ పరిధిలో ఉండే దుకాణాలను జిల్లాకు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానం అమలు జరుగుతుండడంతో ఈ నెల 9వ తేదీ నాటికి మద్యం దుకాణం పొందాలనుకునే వ్యక్తులు దరఖాస్తులు చేసుకుంటారు. వాటిని పరిశీలించి ఈ నెల 11న జిల్లా కేంద్రంలో డ్రా తీసి లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తారు.

జిల్లాలోని మొత్తం 22 మండలాల పరిధిలో 40 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. వాటిలో జిల్లా కేంద్రం పాడేరు, పర్యాటక ప్రాంతం అరకులోయలోనే అత్యధికంగా 4 చొప్పున కాగా, మిగిలిన ప్రాంతాల్లో 1 నుంచి 3 వరకు దుకాణాలను కేటాయించారు. హుకుంపేటలో 1, జి.మాడుగులలో 2, పెదబయలులో 2, ముంచంగిపుట్టులో 1, డుంబ్రిగుడలో 1, చింతపల్లిలో 3, జీకేవీధిలో కొయ్యూరులో 1, రంపచోడవరంలో 2, దేవీపట్నంలో 1, వై.రామవరంలో 1, అడ్డతీగలలో 2, గంగవరంలో 1, మారేడుమిల్లిలో 1, రాజవొమ్మంగిలో 2, చింతూరులో 3, ఎటపాకలో 2, కూనవరంలో 1, వీఆర్.పురంలో 2 మద్యం దుకాణాలను ఏర్పాటు చేస్తారు.



పాడేరులోని ఓ మద్యం దుకాణం

జిల్లాలో దుకాణాలకు వివిధ శ్లాబ్‌లు

జిల్లాలో మొత్తం 40 మద్యం దుకాణాలకు గాను వాటి పరిధిలో జనాభా ఆధారంగా 18 దుకాణాలను రూ.65 లక్షలు, 22 దుకాణాలను రూ.55 లక్షల శ్లాబ్ పరిధిలోకి తీసుకువచ్చారు. ముఖ్యంగా పాడేరు, అరకులోయ, చింతపల్లి, జీకేవీధి, పెదబయలు, ... మిగతా 8వ పేజీలో

ఏయూలో ఏఐ

వీఎల్ఎస్ఐ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ కోర్సులు కూడా...

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు
- విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యమంటున్న వర్సిటీ అధికారులు
- వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ కోర్సు నిర్వహణకు అవసరమైన నిధులు అందించేందుకు ముందుకొచ్చిన మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి బీటెక్, ఎంటెక్‌లలో నూతన బ్రాంచీలను ప్రవేశపెట్టనున్నారు. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించవచ్చునంటున్నారు.

బీటెక్‌లో వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్ఎస్ఐ) కోర్సును ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అంగీకరించింది. ఈ మేరకు మైటీ (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) కార్యదర్శి ఎస్.కృష్ణతో ఏయూ అధికారులు సంప్రతింపులు జరిపారు. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు భారీ వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది నుంచే దీనిని ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వీఎల్ఎస్ఐ కోర్సు చేస్తే మైక్రో చిప్‌లు తయారీ, సెమీ కండక్టర్ల రూపకల్పన, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు తయారీ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఈ కోర్సు నిర్వహణ కోసం అడ్వాన్స్‌డ్ లేబొరేటరీ, ఫ్యాకల్టీ, రీసెర్చ్ ప్రాజెక్టులను ... మిగతా 8వ పేజీలో



క్రైం... crime news

స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ ఒకరి మృతి

అచ్యుతాపురం, అక్టోబరు 2: కొండకర్లలో గల ఓ రిసార్టులోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి సీఐ నమ్మి గణేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సెజ్‌లోని అభిజిత్ కర్మాగారంలో పనిచేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులు కొండకర్లలోగల ఒక రిసార్టులో మంగళవారం గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రం వీరిలో నలుగురు రిసార్టులో గల స్విమ్మింగ్‌పూల్‌లో ఈతకొడుతున్నారు. ఇందులో విశాఖపట్నంలోని గోపాలపట్నం ఆదర్శనగర్‌కి చెందిన పెదపాటి రాజు(39) కూడా ఈత కొడుతూ నీటి అడుగు భాగానికి వెళ్లిపోయాడు. కిందకు వెళ్లిన రాజు పైకి రాకపోవడంతో తోటి స్నేహితులు బయటకు తీశారు. వెంటనే అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది రాజును అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అతను మృతిచెందినట్టు తెలిపారు. కాగా రాజు గతంలో అభిజిత్ కర్మాగారంలో పనిచేసి రెండేళ్ల క్రితం మానేశాడు. ప్రస్తుతం సెంచూరియన్ యూనివర్సిటీలో హార్డ్‌వేర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. పాత స్నేహితులంతా కలిసి కొండకర్లలో గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకోవడంతో ఇక్కడికి వచ్చాడు. స్విమ్మింగ్ పూల్ కేవలం నాలుగున్నర అడుగుల లోతే ఉందని, గుండె సంబంధించిన వ్యాధి కారణంగా మృతిచెంది ఉంటాడని ప్రాథమిక విచారణలో తేలిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తూరు, అక్టోబరు 2: అనకాపల్లి మండలం పిసినికాడ కూడలి వద్ద రోడ్డు దాటుతున్న పాదచారిని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి. పిసినికాడకు చెందిన రాజగిరి కాశీ కశింకోట నుంచి ఆటోలో పిసినికాడ వచ్చాడు. అక్కడి రోడ్డు దాటుతుండగా అదే మార్గంలో కశింకోట హౌసింగ్ కాలనీకి చెందిన పాసిలి శ్రీను(34) ద్విచక్ర వాహనంపై వచ్చి కాశీని ఢీకొన్నాడు. శ్రీను తలకు తీవ్రగాయం కావడంతో వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే శ్రీను మృతి చెందాడు. కాగా రోడ్డు దాటుతున్న కాశీ కాలుకు తీవ్ర గాయం కావడంతో అనకాపల్లిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

కొత్తూరు, అక్టోబరు 2: తల్లి మందలించిందని పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం వల్లూరు గ్రామానికి చెందిన సిమ్మా జ్యోతి (26) తన తల్లి వర మందలించిందని మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. కొద్ది సేపటికి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె తల్లి బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త నూకరాజు, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నేటి నుంచి టెట్

» ఉమ్మడి జిల్లాలో 8 కేంద్రాలు, 60,574 మంది అభ్యర్థులు

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకూ విశాఖ జిల్లాలో ఏడు కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలో ఒక కేంద్రంలో ఆన్‌లైన్‌లో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. మొత్తం 60,574 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తొలిసారి నిర్వహిస్తున్న టెట్‌కు విద్యా శాఖ అన్ని ఏర్పాట్లుచేసింది. ప్రతి కేంద్రానికి ఒక పరిశీలకుడిని నియమించింది. టెట్ నిర్వహణకు సంబంధించి డీఈవో కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే కేంద్రాలకు రావాలని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ విజ్ఞప్తి చేశారు.

ఈదురు గాలులతో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం

» నేడు ఎలమంచిలిలోని పలు వార్డుల్లో తాగునీటి సరఫరా బంద్



రామ్‌నగర్ సమీపంలో నేలవాలిన విద్యుత్ స్తంభం

ఎలమంచిలి, అక్టోబరు 2 : ఎలమంచిలిలో బుధవారం మధ్యాహ్నం తరువాత ఈదురు గాలులతో వర్షం కురవడంతో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. పట్టణంలోని కొత్తపేట, రామ్‌నగర్, పెదపల్లి రోడ్డు, మిలట్రీ కాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ, తులసీనగర్, రంగావారి వీధి, ఓరుగంటి వారి వీధి, జలాలు వీధి, ధర్మవరం, యర్రవరం, మెయిన్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో సమీపంలోని విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రభావం తాగునీటి సరఫరాపై పడింది. గురువారం ఉదయం దాదాపు సగం వార్డులకు కొళాయిల ద్వారా మంచినీరు సరఫరా జరగదని అధికారులు తెలిపారు. కాగా వర్షం తగ్గిన మునిసిపల్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఎలమంచిలి పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో 20కి పైగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఈదురుగాలుల కారణంగా పట్టణంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్తంభాలు దెబ్బతిన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్లను రంగంలోకి దించి కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించారు. తొలుత రాత్రి ఏడు గంటల ప్రాంతంలో మెయిన్ రోడ్డు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం ధర్మవరం వార్డు, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతంలో, రాత్రి 8.30 గంటలకు మిలట్రీ కాలనీ, రంగావారి వీధి, ఓరుగంటివారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పెదపల్లి రైల్వే గేటు సమయంలో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో ఇక్కడ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. రాత్రి పదిన్నర గంటలకు ఇక్కడ కూడా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాగా గంటల తరబడి విద్యుత్ సరఫరా లేకపోవడంతో పట్టణంలోని పలు వార్డుల్లో తాగునీటి సరఫరా జరగలేదని మునిసిపల్ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 4వ వార్డు నుంచి 11వ వార్డు వరకు, 24, 25 వార్డులకు కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా వుండదని, ఈ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

మత్స్యకారుని గేలానికి చిక్కిన భారీ టేకు చేప

అచ్యుతాపురం, అక్టోబరు 2: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన మత్స్యకారుడి గేలానికి సముద్రంలో భారీ చేప చిక్కింది. ఎప్పటిలాగే బుధవారం ఉదయం మత్స్యకారులు పడవలపై చేపల వేటకు వెళ్లారు. ఓ మత్స్యకారుడి గేలానికి 80 కిలోల బరువు గల పెద్ద టేకు చేప చిక్కింది. దానిని అతికష్టమ్మీద ఒడ్డుకు చేర్చారు. ఆ చేపను ఓ వ్యాపారి కిలో రూ.110 చొప్పున కొనుగోలు చేశారు.



టేకు చేప

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	104.00
లైవ్ ధర	124.00
విత్ స్కిన్	218.00
స్కిన్ లెస్	228.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

‘పేట’ పంచాయతీ స్థలం ఆక్రమణ

సుమారు రూ.2 కోట్ల విలువైన ఆస్తికి రెక్కలు

» లేఅవుట్‌లో పంచాయతీకి 408 గజాలు కేటాయింపు
» తర్వాత సగానికి తగ్గిన స్థలం
» ఎనిమిది నెలల క్రితం వెలుగులోకి వచ్చినా మేల్కోని అధికారులు



పంచాయతీ స్థలంలో సిమెంటు తూరల వ్యాపారం చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, అక్టోబరు 2 : పట్టణంలో అక్రమ లేఅవుట్లు, కట్టడాల నియంత్రణకు పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. అక్రమ లేఅవుట్లు, కట్టడాల సంగతి పక్కన బెడితే గతంలో పంచాయతీకి కేటాయించిన స్థలాలను కూడా కబ్జా చేసి దర్జాగా విక్రయిస్తున్నారు. మెయిన్‌రోడ్డులో అత్యంత విలువైన పంచాయతీ స్థలంలో సగం విస్తీర్ణం మా యమవడం ఇందుకు నిదర్శనం.



పంచాయతీ స్థలంలో గతంలో అధికారులు ఏర్పాటుచేసిన బోర్డులో 408 గజాలుగా పేర్కొన్న దృశ్యం



ఈ ఏడాది ప్రారంభంలో స్థల విస్తీర్ణం తొలగించి కొత్తగా ఏర్పాటు చేసిన బోర్డు

పాయకరావుపేట పట్టణంలోని పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహం ఎదుట సర్వే నం.132/3బిలోని ఎ.1.74 ఎకరాల్లో 1985లో వేసిన లేఅవుట్‌కు పంచాయతీ అధికారి అనుమతి ఇచ్చారు. ఈ స్థల యజమాని కుటుంబీకుల గోళీలు ఉన్న స్థలాన్ని ప్రజోపయోగం కోసం కేటాయించినట్టు లేఅవుట్‌లో పేర్కొన్నారు. 2013లో పంచాయతీ స్థలం పక్కనే ఉన్న స్థలాన్ని అమ్మకానికి పెట్టారు. అయితే ఈ లేఅవుట్‌లో 5 శాతం కూడా పంచాయతీ స్థలం లేకపోవడాన్ని గుర్తించిన అప్పటి పంచాయతీ ఈఓ రఘునాథ్‌బాబు తమ రికార్డుల ప్రకారం ఈ లేఅవుట్‌లో 408 గజాలు ఉండాలని పేర్కొంటూ పంచాయతీ స్థలంలో బోర్డును కూడా ఏర్పాటు చేశారు. అంతేతప్ప 408 గజాల పంచాయతీ స్థలాన్ని లేఅవుట్ యజమానుల నుంచి స్వాధీనం చేసుకోలేదు.

ఇదిలా ఉండగా. పంచాయతీ స్థలం పక్కనే ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి ఈ ఏడాది ప్రారంభంలో భవన నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ కోసం పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మేల్కొన్న పంచాయతీ అధికారులు లేఅవుట్ వేసిన వ్యక్తులు పంచాయతీకి కేటాయించిన 408 గజాలను అప్పగిస్తేనే ప్లాన్ అప్రూవల్ ఇస్తామని నిబంధన పెట్టారు. ఇది జరిగి ఎనిమిది నెలలు కావస్తున్నా పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంపై అధికారులు దృష్టిపెట్టలేదు. పంచాయతీ స్థలంలో ఉన్న పాత బోర్డు స్థానంలో కొత్త బోర్డు ఏర్పాటు చేసి, అందులో స్థల విస్తీర్ణం తొలగించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ క్రమంలో పక్క స్థల యజమాని తన స్థలంలో కొద్ది రోజుల క్రితం ఎటువంటి అనుమతుల్లేకుండా సిమెంట్ దిమ్మలు కట్టడం ప్రారంభించగా విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు నిర్మాణం ఆపాలంటూ నోటీసు జారీచేయడంతో విషయం మరోమారు వెలుగులోకి వచ్చింది. పీఆర్ గెస్టుహౌస్ ఎదురుగా పంచాయతీ స్థలంలో మాయమైన 200 గజాల స్థలాన్ని స్థల యజమాని నుంచి స్వాధీనం చేసుకోవడంపై దృష్టి పెట్టాలని పలువురు సూచిస్తున్నారు. లేకుంటే రూ2 కోట్ల విలువైన పంచాయతీ ఆస్తిని కోల్పోవలసి వస్తుందని వాపోతున్నారు. దీనిపై పంచాయతీ ఈఓ వర్మను వివరణ కోరగా.. పట్టణంలో పీఆర్. గెస్టుహౌస్ ఎదురుగా ఉన్న పంచాయతీ స్థలాన్ని ఆనుకుని ఉన్న స్థలం యజమానికి ఇటీవల నోటీసు ఇచ్చామన్నారు. దీంతో ఆ యజమాని తన వద్ద ఉన్న డాక్యుమెంటును చూపించారన్నారు. లేఅవుట్ వేసిన వ్యక్తుల నుంచి మొదట్లో పంచాయతీకి కేటాయించిన 408 గజాల స్థలాన్ని రికార్డుపరంగా స్వాధీనం చేసుకున్న తరువాతనే పక్క స్థలం అమ్మకానికి ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉండగా.. ఇవేమీ పట్టించుకోకుండానే ఎన్‌ఓసీ ఇచ్చేశారన్నారు. దీనిపై పూర్తి విచారణ చేస్తామన్నారు. అలాగే తగ్గిపోయిన 200 గజాల పంచాయతీ స్థలాన్ని లేఅవుట్ వేసిన వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకునేందుకు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు.

గాంధీ జయంతి వేడుకల్లో ప్రొటోకాల్ వివాదం

» స్వచ్ఛతా హి సేవ ఫ్లెక్సీపై మునిసిపల్ చైర్‌పర్సన్ ఫొటోను ముద్రించని అధికారులు
» ఆర్డీవో సమక్షంలో కమిషనర్‌ను నిలదీసిన చైర్‌పర్సన్
» అధికారుల తీరుపై కలెక్టర్‌కు లిఖితపూర్వంగా ఫిర్యాదు



ఫ్లెక్సీలో తన ఫొటో ఎందుకు లేదని కమిషనర్‌ని నిలదీస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, అక్టోబరు 2 : గాంధీ జయంతి వేడుకల్లో ప్రొటోకాల్ వివాదం రాజుకుంది. మునిసిపాలిటీ నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ఫ్లెక్సీ బ్యానర్‌లో తన ఫొటోను ముంద్రించకపోవడంతో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి మనస్తాపానికి గురై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. పురపాలక సంఘం కమిషనర్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ మినీస్టేడియంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్డీవో వీవీ రమణ, చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వార్డు కౌన్సిలర్లను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన స్వచ్ఛతా హి సేవ ఫ్లెక్సీపై చైర్‌పర్సన్ ఫొటో లేకపోవడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ నిర్వహిస్తున్న కార్యక్రమం బ్యానర్‌పై తన ఫొటో ఎందుకు ముద్రించలేదని కమిషనర్‌ను నిలదీశారు. ఫ్లెక్సీపై స్థానిక ఎమ్మెల్యే ఫొటో మాత్రమే వేశారని, తన ఫొటో వేయకుండా అవమాన పరిచారని అన్నారు. ప్రొటోకాల్ పాటించని మునిసిపల్ కమిషనర్‌పై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తున్నానని చెప్పారు.

అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటిన తల్లీకుమార్తె

» ఏడు పతకాలు సాధించిన ఉపాధ్యాయురాలు నాగజ్యోతి, సాహితి
» ఆరు స్వర్ణాలు, ఒక కాంస్యం » నర్సీపట్నంలో సత్కారం



సాధించిన పతకాలతో నాగజ్యోతి, సాహితి

రోలుగుంట, అక్టోబరు 2: సింగపూర్, మలేషియాలో గత నెల 22 నుంచి 30వ తేదీ వరకు సంయుక్త భారతీయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ అంతర్జాతీయ క్రీడల పోటీల్లో రోలుగుంట జడ్పీ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు నాగజ్యోతి, ఆమె కుమార్తె సాహితిలు పాల్గొని 7 స్వర్ణ పతకాలు సాధించారు. స్విమ్మింగ్‌లో 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగాల్లో సాహితి ప్రథమ స్థానంలో నిలిచి మూడు స్వర్ణ పతకాలు సాధించింది. అలాగే నాగజ్యోతి పవర్ లిఫ్టింగ్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో ప్రథమ స్థానంలో నిలిచి మూడు స్వర పతకాలు, 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి ఒక వెండి పతకం మొత్తం నాలుగు పతకాలు సాధించారు. ఈ తల్లీకుమార్తెలు ఇద్దరూ ఇదివరకే ఎన్నో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని వివిధ పతకాలు సాధించారు.

ఈ సందర్భంగా బుధవారం నర్సీపట్నంలోని వాసవి కల్యాణ మండపంలో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ పాల్గొని నాగజ్యోతి, సాహితిలను ఘనంగా సన్మానించారు.

బొజ్జన్నకొండ వద్ద లైటింగ్ అండ్ సౌండ్ షో ప్రారంభం

తుమ్మపాల, అక్టోబరు 2 : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద ఏర్పాటు చేసిన లైటింగ్ అండ్ సౌండ్ షోను కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ బుధవారం రాత్రి ప్రారంభించారు. బొజ్జన్నకొండ చరిత్రపై ప్రదర్శించిన లేజర్ షోను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ బొజ్జన్నకొండ చరిత్రను పర్యాటకులతో పాటు విద్యార్థులకు వివరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, ఆర్డీవో చిన్నికృష్ణ, డీపీవో శిరీషారాణి, ఎస్‌డీసీ ఎస్. సుబ్బలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.



బొజ్జన్నకొండ వద్ద లేజర్ షోను ప్రారంభిస్తున్న ఎంపీ రమేశ్

డొంకరాయిలో మొసళ్లు హల్‌చల్

» జలాశయం నుంచి బయటకు వచ్చిన మూడు మకరాలు

సీలేరు, అక్టోబరు 2: అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం వద్ద మొసళ్లు హల్‌చల్ చేశాయి. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో జలాశయం నుంచి మూడు మొసళ్లు బయటకు వచ్చాయి. అక్కడ విధుల్లో ఉన్న ఉద్యోగులు వాటిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. మూడింటిలో రెండు మొసళ్లు మళ్లీ జలాశయంలోకి వెళ్లిపోగా, ఒకటి మాత్రం డ్యామ్ రెండో నంబర్ గేటు సమీపంలో రోడ్డు ఉండిపోయింది. అధికారుల ఆదేశాలతో జెన్‌కో సెక్యూరిటీ సిబ్బంది మొసలిని జలాశయంలోకి పంపించారు. కాగా, జలాశయంలో మొసళ్లు అధికంగా ఉన్నాయని, తరచూ ఒడ్డుకు వస్తున్నాయని చేపల వేటను సాగించే జాలర్లు చెబుతున్నారు.



డొంకరాయి మెయిన్ డ్యామ్ వద్ద రోడ్డుపైకి వచ్చిన మొసలి

నేటి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 2: కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో గురువారం నుంచి ఏడో తేదీ వరకు కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహించనున్నామని కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు తెలిపారు. ప్రతి రోజు రెండు నాటికలు ప్రదర్శిస్తారన్నారు. ఈ నాటిక పోటీలు మాజీ కౌన్సిలర్ కేఎం నాయుడు, మళ్ల సూరిబాబు, దేవాదుల శివాజీ తదితరుల పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు.

సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం

పాయకరావుపేట, అక్టోబరు 2: స్థానిక శ్రీప్రకాశ్ విద్యా సంస్థల్లో సీబీఎస్ఈ క్లస్టర్-7 (ఆంధ్రా, తెలంగాణ)కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో సుమారు 100కి పైగా పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ పోటీలను శ్రీప్రకాశ్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాశ్, ప్రో కబడ్డీ అఫీషియల్ పీవీఎస్‌వీ ప్రసాద్, బి.మురళీకుమార్, నేషనల్ వాలీబాల్ అసోసియేషన్ మెంబర్ మోహన్‌కుమార్, నేషనల్ వాలీబాల్ రిఫరీ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రీడా పోటీల పరిశీలకులు ఎల్.వెంకటరమణ, కె.హేమంత్‌కుమార్ రావు, వివిధ పాఠశాలల విద్యార్థినులు, కోచ్‌లు, మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీ జరుగుతున్న దృశ్యం

యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష



దీక్షలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 2: మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ నాయకులు బుధవారం నెహ్రూ చౌక్‌లో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు ఉపాధ్యాయులకు దండలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం కూడా మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న హెడ్‌మాస్టార్, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలన్నారు. హెచ్‌ఎంల్లో అర్హులైన వారిని అర్బన్ ఎంఈవోలుగా నియమించాలన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ సత్యాగ్రహ దీక్షలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, మునిసిపల్ సంఘ నాయకులు అక్కునాయుడు, మాకిరెడ్డి రాజునాయుడు, బాషా, నాతవరపు సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 97.33 శాతం పింఛన్లు పంపిణీ

అనకాపల్లి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ బుధవారానికి 97.33 శాతం పూర్తయిందని డీఆర్‌డీఏ పీడీ శశీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,60,816 మంది లబ్ధిదారులుండగా మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారని తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు జిల్లాలో మొత్తం 2,53,985 (97.33 శాతం)మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించామన్నారు. స్థానికంగా ఉండకపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇళ్లల్లో అందుబాటులో లేని 6,831 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

నేటి నుంచి ఉపమాకలో బ్రహ్మోత్సవాలు

నక్కపల్లి, అక్టోబరు 2: మండలంలోని ఉపమాక క్షేత్రంలో గురువారం నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఆలయంలో ఏర్పాటు పూర్తి చేశారు. గురువారం రాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 4న పెద్ద పల్లకీపై తిరుపతి సేవ, ధ్వజారోహణం, 9న వసంతోత్సవం, గురుడసేవ, 10న పుణ్యకోటి వాహనంపై ఊరేగింపు, 11 రాత్రి మృగ వేట, 12న మధ్యాహ్నం వినోద ఉత్సవం, విజయదశమి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు చెప్పారు.



ఉపమాక ఆలయంలో ఏర్పాట్లు (ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో స్వామి, అమ్మవారు

అది వన మహోత్సవ కార్యక్రమమే..

» ఇన్‌చార్జి డీఎఫ్‌వో సునీల్‌కుమార్

అనకాపల్లి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవం సందర్భంగా కశింకోట మండలం బయ్యవరంలోని శారదా వనంలో కార్యక్రమాన్ని నిర్వహించామని, అది ప్రారంభోత్సవం కాదని జిల్లా అటవీశాఖ ఇన్‌చార్జి డీఎఫ్‌వో సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండా అటవీశాఖ అధికారులే శారదా వనాన్ని హడావిడిగా ప్రారంభించడాన్ని ‘అటవీ అధికారుల ఇష్టారాజ్యం’ శీర్షికన బుధవారం కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన జిల్లా అటవీశాఖాధికారి వివరణ ఇచ్చారు. శారదా వనంలో ముఖ ద్వారం నిర్మాణం, లోపల ఆవరణలో కొన్ని మొక్కలు మాత్రమే పెంచడం జరిగిందని తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా అటవీశాఖ ఉన్నతస్థాయి అధికారుల సూచనల మేరకు శారదా వనంలో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

నేడు ఎలమంచిలిలో అన్న క్యాంటీన్ ప్రారంభం

ఎలమంచిలి, అక్టోబరు 2: నియోజకవర్గ కేంద్రం ఎలమంచిలి పట్టణంలోని కొమ్మాయి గుండం వద్ద గురువారం అన్న క్యాంటీన్ భవనాన్ని ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు మునిసిపల్ అధికారులు పూర్తి చేశారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రత్యేక గ్రామసభలతోనే అభివృద్ధి సాధ్యం

▸▸ జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

హుకుంపేట, అక్టోబరు 2: గిరిజన ప్రాంతాల అభివృద్ధి ప్రత్యేక గ్రామసభలతోనే సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ తెలిపారు. మండలంలోని గడికించుమండలో సర్పంచ్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభ నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. అనంతరం మొట్టుజోరు కొంతెలిలో జరిగిన సభలో జేసీ మాట్లాడుతూ సమస్యలపై గ్రామసభల్లో అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ఆమోదించి ప్రభుత్వానికి పంపిస్తే, పంచాయతీరాజ్ శాఖ నుంచి ప్రత్యేక నిధులు విడుదల కానున్నాయన్నారు. పంచాయతీల అభివృద్ధికి ఈ మేరకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. పంచాయతీరాజ్ నిధులతో 29 రకాల అభివృద్ధి పనులు సాధ్యమవుతాయన్నారు. హుకుంపేట మండలంలోని గడికించుమండ, మొట్టుజోరు, కొంతెలి గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్టు చెప్పారు. 75 ఏళ్లు నిండిన వృద్ధులకు గాంధీ జయంతి పురస్కరించుకుని సన్మానించారు. ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎంపీపీ రాజుబాబు, ఎంపీటీసీ సభ్యుడు మహేశ్వరావు, అడ్డుమండ సర్పంచ్ శ్యాంసుందర్, ఎంపీడీవో వెంకటరావు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారావు, పంచాయతీరాజ్ జేఈ సంజీవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రమేశ్, ట్రైబల్ వెల్ఫేర్ జేఈ ధ్రువ, ఏపీవో మూర్తి, హౌసింగ్ జేఈ గౌరీశంకర్ అశోక్ పాల్గొన్నారు.

ఆదిమ గిరిజనులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు

▸▸ ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్



విద్యుత్ మీటర్ ధ్రువపత్రం అందిస్తున్న ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్

పాడేరు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): జన్‌మన్ యోజనలో భాగంగా ఆదిమ జాతి గిరిజనులకు ఉచితంగానే గృహ విద్యుత్ మీటర్లను అందిస్తున్నామని ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జీఎస్.ప్రసాద్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కాడెలి పంచాయతీ కేంద్రంలో పలువురికి విద్యుత్ మీటర్ల మంజూరుకు సంబంధించిన ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన జన్‌మన్ లబ్ధిదారులందరికీ విద్యుత్ మీటర్ల మంజూరుకు ధ్రువీకరణపత్రాలను అందించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అలాగే ఈఈ అప్పారావు జి.మాడుగుల మండలం, ఇతర ఇంజనీర్లు, అధికారులు వివిధ మండలాల్లో పాల్గొని ధ్రువీకరణ పత్రాలు అందించారని చెప్పారు.

మలేరియా అదుపునకు చర్యలు

▸▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జలామ్ బాషా


చింతగున్నలలో దోమతెరలను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

పాడేరు రూరల్, అక్టోబరు 2: గిరిజన గ్రామాల్లో మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా తెలిపారు. మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని చింతగున్నల, వరంకూర, చీడిపాలెం పీవీటీజీ గ్రామాల్లో ప్రజలకు దోమతెరలను పంపిణీ చేశారు. అలాగే ప్రత్యేక వైద్య శిబిరాల్లో పాల్గొని రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమతెరలను ఎండలో ఆరబెట్టరాదని చెప్పారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తం కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి, ఆరోగ్య పర్యవేక్షకులు ఎల్‌వీ.వరలక్ష్మిపాత్రో, కె.ఝాన్సీ, సిబ్బంది బి.ఎలీషారావు, ఎస్.నాగరాజు, కె.లక్ష్మణరావు, కె.భీమన్నదొర, కేవీవీఆర్‌కే.మూర్తి, వి.స్వర్ణలత, కె.నాగరాజు, వెంకటచలం, వి.శంకరరావు, ఎస్‌పీ.పడాల్, వెంకటరమణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

▸▸ టీడీపీ అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర


అరకు ఆస్పత్రి మార్గంలో చెత్తను తొలగిస్తున్న నాయకులు, అధికారులు

అరకులోయ, అక్టోబరు 2: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. బుధవారం గాంధీ జయంతి పురస్కరించుకుని మొదట కళా గ్రామంలోని గాంధీ విగ్రహానికి పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, పార్టీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరకు ప్రాంతీయ ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహం గల రహదారిని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసుబాబు, ఎంపీటీసీ సభ్యులు దురియా ఆనందరావు, భీమరాజు, వార్డు సభ్యులు, ఉప సర్పంచ్ చందూ విజయనిర్మల, టీడీపీ నాయకులు ద్రౌపతి, కళావతి, ఎన్‌హెచ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎం కెందుకు సేవారత్న అవార్డు


హెచ్‌ఎం కెందును అవార్డును అందించి సత్కరిస్తున్న దృశ్యం

అరకులోయ, అక్టోబరు 2: రవ్వలగుడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల హెచ్‌ఎం కెందును చైతా స్వచ్ఛంద సంస్థ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవారత్న అవార్డుతో సత్కరించారు. బుధవారం అరకులోయ టూరిజం రిసార్టులో ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. హెచ్‌ఎం కెందు గిరిజన విద్యార్థులకు చక్కటి బోధనతో పాటు పాఠశాల ప్రాంగణంలో పచ్చటి మొక్కలతో ఆహ్లాదకర వాతావరణం కల్పనకు కృషి చేస్తున్నారు. తన సేవలను గుర్తించి అవార్డు అందజేయడంపై హెచ్‌ఎం కెందు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధికి గ్రామసభలు దోహదం

జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

డివిజన్‌లోని ఆరు పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు



పాడేరు మండలం వంజంగి గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రామసభలు దోహదపడతాయని కలెక్టర్ దినేశ్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పాడేరు మండలం వంజంగి గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతిపిత గాంధీజీ కలలు కన్నట్టుగా గ్రామాలు అభివృద్ధి చెందితే సమాజం ముందుకు వెళుతుందని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగానే తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లని కలెక్టర్ సూచించారు. స్థానిక అవసరాలను గుర్తించి, వాటి ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు చేపట్టాలనే లక్ష్యంతోనే గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీనికి ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజలు తమ సహకారాన్ని అందించాలన్నారు.

పర్యావరణహితంగా పర్యాటకాభివృద్ధి

వంజంగి హిల్స్‌కు ఈనెల నుంచి జనవరి వరకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తారని, పర్యావరణహితంగా పర్యాటకాభివృద్ధి ఉండేలా స్థానికులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్థానిక ఆచారాలు, సంప్రదాయాలకు ఇబ్బందులు కలగకుండా పర్యాటకుల సందర్శన జరిగేలా స్థానికులు అప్రమత్తం కావాలన్నారు. స్థానిక పరిస్థితులు, సంప్రదాయాలను వారికి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్లు, క్లాప్ మిత్రలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పాత్రుడు, సర్పంచ్ బొంజుబాబు, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, ఎంపీడీవో సాయినవీన్ పాల్గొన్నారు.

జిల్లాలో ఆరు చోట్ల ప్రత్యేక గ్రామసభలు

జాతిపిత గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా 720 చోట్ల ప్రత్యేక గ్రామసభలను నిర్వహిస్తే, జిల్లాలో ఆరు చోట్ల నిర్వహించామని కలెక్టర్ దినేశ్ కుమార్ తెలిపారు. పాడేరు మండలం వంజంగి, గొండెలి (సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ఆధ్వర్యంలో, గుత్తులపుట్టులో (డీఆర్‌డీపీ పీడీ వి.మురళి), బడిమెలలో (ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి), హుకుంపేట మండలం జీకే మండ (జేసీ అభిషేక్ గౌడ్), మొట్టుజోరు (డ్వామా పీడీ శివయ్య)లో ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు.

జాతిపిత ఆశయ సాధనకు కృషిచేద్దాం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

వాడవాడలా గాంధీ జయంతి వేడుకలు


పాడేరులో గాంధీ, లాల్‌బహదూర్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఐటీడీఏ అధికారులు


ముంచంగిపుట్టులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, అధికారులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 2: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు అందరూ కలసికట్టుగా కృషి చేద్దామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పిలుపునిచ్చారు. మన్యంలో వాడవాడలా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ముంచంగిపుట్టు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి జడ్పీ చైర్‌పర్సన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ అడుగుజాడల్లో అందరూ నడుస్తూ శాంతియుత మార్గం, సిద్ధాంతాలను పాటించాలని కోరారు. గాంధీజీ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. సత్యాగ్రహం అనే ఆయుధంతో అఖండ భారతావనికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తెచ్చిపెట్టిన వారిలో గాంధీ ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, ఎంఈవో క్రిష్ణమూర్తి, పీఆర్ ఏఈ మురళీకృష్ణ, ఎంపీపీ ఎ.సీతమ్మ, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, సర్పంచ్ ఎస్.సుభాష్, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సుబ్బలక్ష్మి, గాంధీ విగ్రహ దాత ఎస్‌కే.రెహమాన్ చంటి, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జేవీవీఎన్ మూర్తి, నాయకులు జయదేవ్, దామోదరం పాల్గొన్నారు.

మహాత్ముడు సేవలు ఆదర్శనీయం: కిడారి

అనంతగిరి: సమాజహితమే అభిమతంగా జీవితాన్ని త్యాగం చేసిన మహాత్ముడు సేవలు ఆదర్శనీయమని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గాంధీజీ చిత్రపటానికి టీడీపీ నాయకులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య పాలనకు సీఎం చంద్రబాబు నాంది పలికారన్నారు. అలాగే గత ప్రభుత్వం చెత్తపై పన్నువేసి ప్రజలను ఇబ్బంది పెట్టిందని, దీన్ని గాంధీ జయంతి రోజున సీఎం చంద్రబాబు రద్దు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, నాయకులు ఎం.జోగులు, వైస్ సర్పంచ్ నరేంద్ర, బి.లక్ష్మణరావు, డి.శ్యామ్, పి.జగన్‌బాబు, వి.శివ పాల్గొన్నారు.

పాడేరులో...

పాడేరు రూరల్: ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు జాతిపిత మహాత్మాగాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో ఎం.హేమలత, సిబ్బంది పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నివాస గృహం కుమ్మరిపుట్టులో పార్టీ శ్రేణులతో కలిసి గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. గాంధీ మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలుపర్తి గోవిందరావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, నాయకులు బుద్ద జ్యోతికిరణ్, దన్నేటి పలాసి సురేష్‌కుమార్, ఎస్‌వీ.రమణమూర్తి, కిముడు విశ్వ, కిల్లు రాధాకృష్ణ, కూడా రాజేష్, అర్లబు రవి, కోడా కోటిబాబు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: చైర్‌పర్సన్


భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

ముంచంగిపుట్టు, అక్టోబరు 2: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. వనభసింగి పంచాయతీ టొంగికోట గ్రామంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్ సహకారంతో నిర్మించిన పాఠశాల భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ పాఠశాల భవనం భారీ వర్షాలకు నేలమట్టమైంది. దీంతో గ్రామస్థులు ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌లో బోధన సాగుతోంది. ఈ స్థితిలో ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ చొరవతో నిర్మించిన నూతన భవనాన్ని జడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, సర్పంచులు వి.లక్ష్మణ్, ఎంఈవో కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సుబ్బలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సింహాద్రి పాల్గొన్నారు.

జిల్లాలో 40 మద్యం దుకాణాలు

... 5వ పేజీ తరువాయి

హుకుంపేట ప్రాంతాల్లోని దుకాణాలకు రూ.65 లక్షలు, మిగిలిన ప్రాంతాల్లోని దుకాణాలకు రూ.55 లక్షలు తొలి ఏడాదికి డిపాజిట్‌గా చెల్లించాలి. అలాగే ప్రతి దుకాణానికి నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజుగా రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగుస్తుంది. వాటిని పరిశీలించి అధికారులు ఈ నెల 11న అందరి సమక్షంలో లాటరీ ద్వారా దుకాణదారులను ఎంపిక చేస్తారు. అలాగే లాటరీలో మద్యం దుకాణాన్ని దక్కించుకున్న వ్యక్తులు 2024-26 అంటే రెండేళ్లకు దుకాణాన్ని నిర్వహించుకోవచ్చు.

ఏకలవ్య స్కూళ్లతో మెరుగైన విద్య

... 5వ పేజీ తరువాయి

డైరెక్టర్ కూడ కృష్ణారావు, జడ్పీటీసీ సభ్యుడు కె.బొంజుబాబు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు, గురుకులాల నోడల్ ప్రిన్సిపాల్ మూర్తి, సర్పంచ్ పి.మాధవరావు, తహసీల్దార్ జి.రంగారావు, ఎంపీడీవో బి.విగ్గిస్, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో..

అరకులోయ: అరకులోయ మండలం బొండాం పంచాయతి మజ్జివలస గ్రామ సమీపంలో నిర్మించిన ఏకలవ్య పాఠశాల భవనాల ప్రారంభ కార్యక్రమంలో గురుకుల ఉప కార్యదర్శి సుభాషిణి, టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర, బొండాం సర్పంచ్ భాస్కరరావు, ఎంపీపీ ఉషారాణి, జడ్పీటీసీ సభ్యురాలు రోష్నీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుకుల ఉప కార్యదర్శి సుభాషిణి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు.

ఈఎంఆర్ పాఠశాలలతో కార్పొరేట్ విద్య

▸▸ టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి


గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, సెప్టెంబరు 2: ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాలలు (ఈఎంఆర్ఎస్) ద్వారా ఆదివాసీ విద్యార్థులకు ప్రభుత్వం కార్పొరేట్ విద్య నందిస్తున్నదని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. రూ.44 కోట్లతో నిర్మించిన ఈఎంఆర్ పాఠశాలను బుధవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గిడ్డి ఈశ్వరి ముందుగా గాంధీ చిత్రపటానికి పూలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి మండలానికి ఒక ఈఎంఆర్ పాఠశాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. నూతనంగా ఏర్పాటైన అల్లూరి జిల్లాలో నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు చేసిందని, రానున్న రోజుల్లో ఈ పాఠశాలలు కూడా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఆదివాసీ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, సీపీడబ్ల్యూడీ ఈఈ వి.శ్రీనివాసరావు, ఏఈఈ కె.శ్రీనివాసరావు, డీడీ ఎల్.రజిని, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు ధారలక్ష్మిపద్మ, జయలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, భూషణం పాల్గొన్నారు.

ఐదేళ్లలో వైసీపీ కనుమరుగు: ఏఐసీసీ సభ్యుడు రాకేశ్‌రెడ్డి

చింతపల్లి, అక్టోబరు 2: రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో వైసీపీ కనుమరుగుకానున్నదని ఏఐసీసీ సభ్యుడు పి.రాకేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన చట్టాలు పక్కాగా అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ర్యాలీ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ల అధికారంలోనున్న వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సర్వనాశనం చేశారన్నారు. మళ్లీ రాష్ట్ర ప్రజలు వైసీపీని విశ్వసించే పరిస్థితిలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రాంతంలోనే అత్యధిక ఓట్లు వచ్చాయన్నారు. గిరిజన ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. దీన్ని ప్రజలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారన్నారు. అనంతరం పాత బస్టాండ్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు, విజయనగరం జిల్లా అధ్యక్షులు రమేశ్, గాజువాక ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, విశాఖజిల్లా ఉపాధ్యక్షుడు అచ్చిబాబు, రాష్ట్ర కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, జీకేవీధి మండలాధ్యక్షుడు కిల్లో చిరంజీవి, నాయకులు బాలకృష్ణ, చిట్టిబాబు, కల్యాణ్, అప్పలరాజు, గురుమూర్తి పాల్గొన్నారు.

ఏయూలో ఏఐ

... 5వ పేజీ తరువాయి

కూడా 'షైటీ' సమకూర్చనున్నది. దీంతోపాటు ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సును వచ్చే ఏడాది నుంచి ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఇప్పటికే అపారమైన అవకాశాలను కల్పిస్తున్న క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి కోర్సులను వచ్చే ఏడాది నుంచి ప్రత్యేక బ్రాంచీలుగా ఏర్పాటుచేసి ప్రవేశాలు కల్పించేందుకు ఏయూ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటిని బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్టుమెంట్‌లతో అనుసంధానం చేయనున్నారు.

సీట్లపై తర్జనభర్జన

ఆయా కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్న అధికారులు ఎన్ని సీట్లతో ప్రారంభించాలన్న దానిపై తర్జనభర్జన పడుతున్నారు. ఇందుకోసం ఇంజనీరింగ్ కాలేజీలోని వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లతో సంప్రతింపులు జరుపుతున్నారు. రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు తెలిపారు. నూతనంగా ప్రారంభించబోయే కోర్సులతో విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందునే వర్సిటీలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఇతర కోర్సులపై కూడా అధ్యయనం చేస్తున్నామని, వాటికి ఉన్న డిమాండ్, విద్యార్థులు చేరేందుకు గల అవకాశాలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకువస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు.

☛ సంక్షిప్తంగా..

ఏకలవ్య పాఠశాలలతో విద్యాభివృద్ధి: ఎమ్మెల్యే మత్స్యలింగం

హుకుంపేట, అక్టోబరు 2: గిరిజన చిన్నారుల విద్యాభివృద్ధికి ఏకలవ్య పాఠశాలలు దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని మొట్టుజోరు పంచాయతీ నక్కలపుట్టు గ్రామంలో బుధవారం పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పాఠశాల నిర్మాణానికి రూ.40 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. ఈ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ పాఠశాల ప్రారంభమైతే మైదాన ప్రాంతంలోని పాఠశాలలకు దీటుగా స్థానిక విద్యార్థులకు విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజుబాబు, సర్పంచ్ సొంబ, పూర్ణ, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమ, నాయకులు బి.వెంకటరమణ, సాగరి సత్యవతి, సూర్యకాంతం, శశిభూణ్‌నాయుడు, గసన్న బేసు పాల్గొన్నారు.

పాతకోట ఏకలవ్య పాఠశాలకు శంకుస్థాపన

అనంతగిరి: అనంతగిరి పంచాయతీలోని పాతకోట వద్ద రూ.40 కోట్లతో నిర్మించనున్న ఏకలవ్య పాఠశాల భవనాలకు ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, పాఠశాలకు భూమిని దానం చేసిన పాతకోట గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రూతు, ప్రిన్సిపాల్ మూర్తి, వైస్ సర్పంచ్ అర్జున్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరు రూరల్, అక్టోబరు 2: సబ్ స్టేషన్‌లలో ఫీడర్ల మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఏపీఎస్‌ఎం.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. జీకే వీధి మండల పరిధిలోని జీకే వీధి, గూడెం, పాతవీధి, గుమ్మర్లగొంది, పెదబయలు మండలంలోని అడుగులపుట్టు, లక్ష్మీపేట, రూడకోట, బూసిపుట్టు గ్రామాలకు ఆయా సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

పిడుగుపడి ఆవు మృతి

హుకుంపేట, అకోబరు 2: మండలంలోని రంగశీల గ్రామంలో పిడుగుపాటుతో ఆవు మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన కుండా సీతారాం పశువులను గ్రామ సమీపంలో మేతకు తీసుకువెళ్లారు. ఇదే సమయంలో పిడుగు పడడంతో ఆవు మృతి చెందింది. రూ.35 వేలు అప్పుగా తీసుకుని కొనుగోలు చేసిన ఆవు మృతి చెందడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు.

అన్న సమారాధన

సీలేరు, అక్టోబరు 2: స్థానిక షిర్డీసాయి ఆలయంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. అలాగే సాయిబాబా జయంత్యుత్సవాల సందర్భంగా నగర కీర్తన ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి పాటుపడాలి

డుంబ్రిగుడ, అక్టోబరు 2:: గాంధీజీ కలలు కన్న స్వరాజ్యానికి పాటుపడాలని పోతంగి గ్రామ సర్పంచ్ వెంకటరావు అన్నారు. పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి విజయ్‌కుమార్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రత్యేక ప్రణాళిక అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గీత, టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, ఉప సర్పంచ్ జగ్గనాయుడు, టీడీపీ నేత సింహాద్రి పాల్గొన్నారు.

ఎంపీడీవో సేవలు ఆదర్శనీయం

ముంచంగిపుట్టు, అక్టోబరు 2: ఎంపీడీవో కిరణ్ కుమార్ సేవలు ఆదర్శనీయమని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. బదిలీపై వెళ్తున్న సందర్భంగా బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన్ను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులతో కలిసి చైర్‌పర్సన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, సర్పంచులు నరసింగరావు, నీలకంఠం, నాయకులు జగబంధు, పద్మారావు పాల్గొన్నారు.

పాత్రికేయుల ఆందోళన

ముంచంగిపుట్టు, అక్టోబరు 2: పాడేరు మండలం లగిసిపల్లి గ్రామ సమీపంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో గిరిజన విలేకరులు నిర్మించుకున్న రేకుల షెడ్లను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గాంధీ విగ్రహం ఆవరణలో ప్ల కార్డులు చేతబట్టి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎంపీడీవో కిరణ్‌కుమార్‌లకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు సురేష్, భూషణ్, విజయ్‌వెంకట్, మోహన్, శంకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజరాజేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు

పాడేరు రూరల్, అక్టోబరు 2: పాత బస్టాండ్ ప్రాంగణంలోని పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో బుధవారం విడుదల చేశారు. రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రతీ రోజు వివిధ అలంకరణలతో పూజలు, అర్చనలు, తొమ్మిది రోజులు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరామం పంతులు, ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ఆధ్యాత్మిక ముఖ్య కార్యవర్గ సభ్యులు ఎస్‌కొండలరావు, డి.బాబూరావు, కొట్టగుళ్లి రామారావు, వి.రాజబాబు, కె.పోతురాజు, వి.సత్యనారాయణ, ఎస్.సోమరాజు, కె.ప్రభాకర్, నాగు, బాలన్న, రవిశంకర్, శివ, దిలీప్, జ్యోతి, పద్మావతి, పద్మ పాల్గొన్నారు.

శతశాతం విద్యుత్ కనెక్షన్లు కలిగిన పంచాయతీలకు ప్రశంసా పత్రాలు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 2: స్థానిక విద్యుత్ డివిజన్ పరిధిలోని పంచాయతీల్లో శతశాతం విద్యుత్ కనెక్షన్లు కలిగిన సర్పంచులకు ఇంజనీరింగ్ అధికారులు ప్రశంసాపత్రాలు అందజేశారు. బుధవారం దేవరాపల్లి పంచాయతీ సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, చింతపల్లి మండలం పెద బరడ పంచాయతీ సర్పంచ్ సమిడి గోపాల్‌కు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎల్ డీఈ రాంబాబు, ఏఈఈ వనుము ప్రభాకరరావు పాల్గొన్నారు.